క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఆస్పత్రి తనిఖీల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు వహించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన సేవలు అందించాలన్నారు.

వైద్య కళాశాలకు బస్సు



బస్సును ప్రారంభిస్తున్న మంత్రులు, కలెక్టర్, తదితరులు

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి జిల్లా వైద్యకళాశాలకు సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన బస్సును బుధవారం మంత్రులు కొండాసురేఖ, దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. బస్సు అందుబాటులోకి రావడం వల్ల మెడికల్ విద్యార్థుల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గీతామాధురి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో ఇబ్బందులు



ప్రధాన రహదారిపై వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

సంగారెడ్డి జోన్: ప్రధాన రహదారులపై ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్లలో ఉన్న ఇసుకపై ఎలాంటి కవర్లు వినియోగించకుండా తరలించటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఎలాంటి రక్షణలు లేకుండా వేగంతో వెళ్లటంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

తప్పిపోయిన బాలుడు అరగంటలో తండ్రి వద్దకు

పటాన్‌చెరు టౌన్: తప్పిపోయిన బాలుడిని అరగంటలో తండ్రి వద్దకు చేర్చిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పటాన్‌చెరు జే.పీకాలనీకి చెందిన జయపాల్ రెండేళ్ల కుమారుడు సందీప్ గాంధీ థీమ్ పార్కు వద్ద బుధవారం ఉదయం ఏడుస్తూ కనిపించాడు. పోలీసులు చూసి బాలుడి వివరాలు అడుగగా వివరాలు చెప్పకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడు వివరాల కోసం ఆరా తీయగా జేపీకాలనీలో ఉండేవాడని తెలిసింది. బాలుడి తండ్రిని పిలిపించి అప్పజెప్పారు.

ఓటర్ నమోదు అవగాహన కోసం 2కే రన్

కంది(సంగారెడ్డి): ఓటర్ నమోదుపై కందిలో మంగళవారం 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ 18 యేళ్లు నిండిన యువతి, యువకులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కలిగి ఉండాలని, ఫారమ్ 6ను నింపి బీఎల్‌ఓలకు అందజేయాలని, డిసెంబరు ఆఖరు వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ మల్లేశం, ఎంపీఓ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ పాల్గొన్నారు.

రోడ్ల గుంతల పూడ్చివేత



మట్టితో పూడ్చివేసిన గుంతలు

జహీరాబాద్ టౌన్: దెబ్బతిన్న రోడ్డు వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరమ్మతుల గురించి ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామానికి చెందిన శ్రీనివాస్ సొంత డబ్బుతో గుంతల పూడ్చివేత పనులు ప్రారంభించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్యతో ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి: రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి సహచర మంత్రి కొండా సురేఖతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్యచే ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. పుస్తక పఠనంతో చరిత్ర తెలుస్తుందన్నారు. అన్ని మండలాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి చదువుకుంటే చరిత్రతో పాటు పిల్లలు సరస్వతి పుత్రులు, సంస్కార వంతులుగా తయారవుతారని పేర్కొన్నారు. పిల్లలు గొప్పవారు కావాలనే తల్లిదండ్రుల తపనతో పాటు సమాజ హితం గురించి ఆలోచించాలని కోరారు. గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా రెడ్డి, గ్రంథాలయ రాష్ట్ర చైర్మన్ రియాజ్ అహ్మద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ టోపాజి అనంత కిషన్, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పదిలో అధిక మార్కులు సాధించాలి

ఎంపీడీఓ హరినందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినందన్‌రావు

మునిపల్లి(అందోల్): పదవ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలని ఎంపీడీఓ హరినందన్ రావు విద్యార్థులను కోరారు. బుధవారం మండలంలోని పెద్ద చల్మెడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంబంధించి పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో పై చదువులు చదివి ఉన్నత స్థానం పొంది తల్లి దండ్రులు, గురువులకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, సురాజ్, రవీందర్, అజయ్ కుమార్, కిష్టయ్య, వీరేశం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్: విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని బాలికల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత చదువులు చదవాలన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా గురువారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ, హెచ్ఐజీ, ఎంఆర్ఎఫ్, మ్యాక్ సొసైటీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. మ ధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రామచంద్రారెడ్డినగర్‌కాలనీ, నాగులమ్మ ఆలయం ప్రాంతం, స్నేహలేక్‌వ్యూ అపార్ట్‌మెంట్, జీహెచ్ఎంసీ కార్యాల యం పరిసర ప్రాంతం బీడీఎల్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు.

జిన్నారం (పటాన్‌చెరు): 33/11 కెవి సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. జిన్నారం సోలక్ పల్లి, శివానగర్, గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్న గూడెం, దోమడుగు గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ దుర్గాప్రసాద్ తెలిపారు.

సర్వేలో సమగ్ర సమాచారం అందించాలి

సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



జహీరాబాద్: సర్వేను ప్రారంభిస్తున్న గిరిధర్‌రెడ్డి



ఝరాసంగం(జహీరాబాద్): స్టిక్కర్‌లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన, ఇంటింటి సర్వేకు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఇంటికి సర్వే కరపత్రాన్ని అంటించి సమగ్ర సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికి సర్వే నిమిత్తం వచ్చే ఎన్యూమరేటర్లకు తగిన సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, తాజామాజీ సర్పంచ్ జగన్మోహన్, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, కాంగ్రెస్ నాయకులు పి.నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, జమీలుద్దీన్, అక్బర్, ఇమాంపటేల్ పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ఇన్యూమరేట్లు స్టిక్కర్లను అంటిస్తున్నారు. బుధవారం మండలంలోని బుదేరాలో ఎన్యూమరేటర్లు ఇంటింటి సర్వే చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, టీచర్స్, ఏఈఓ స్నేహ, అంగన్‌వాడి కార్యకర్త, ఆయాలు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉల్లాస్ పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు . బుధవారం సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వివరాలను తెలియజేయాలని ఆర్థిక, సామాజిక పరిస్థితుల వివరాలను తెలియజేయాలని కోరారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి కోరారు. పట్టణంలో ఆమె నివాసం వద్ద నుంచి బుధవారం సర్వేను ప్రారంభించారు. ఎన్యూమరేటర్లులకు తమ కుటుంబ వివరాలు తెలిపారు. వార్డు ఇన్‌చార్జి రమేశ్, సూపర్‌వైజర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): కుల గణన సర్వేను సక్రమంగా చేపట్టాలని ఎన్యుమరేటర్లకు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలో కుల గణన సర్వే ప్రారంభమైంది. ఎంపీడీఓ, ఎంపీఓ మహేందర్రెడ్డి సర్వేను కంది, చిమ్నాపూర్ గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 13 వరకు చేపట్టనున్న సర్వేను తప్పులు లేకుండా నిర్వహించాలని కోరారు.

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే ప్రారంభమైంది. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు హాజరయ్యారు. ప్రతి ఒక్కరు తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సమగ్ర సర్వే స్టిక్కర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, వెంకటేశం, మండల ప్రత్యేకాధికారి లలిత కుమారి, ఎంపీడీఓ సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



చెరుకును అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్‌చెరు నియోజకవర్గం నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొని ఛట్ పూజను పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తన నివాసంలో బుధవారం నియోజకవర్గ పరిధిలోని పటాన్ చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల ప్రాంతాలలో నివసిస్తున్న ఉత్తర భారతీయులకు చెరుకును సొంత నిధులతో కొనుగోలు చేసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం తగు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలు ఆదర్శనీయం

మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



శివాజీ మహరాజ్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ఛత్రపతి శివాజీ మహరాజ్ చూపిన ఆశయాలు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి కొనియడారు. బుధవారం సిర్గాపూర్ మండలం చీమల్‌పాడులో శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ చేశారు. ధర్మం కోసం పోరాటం చేసిన వీరుడు శివాజీ మహరాజ్ చూపిన బాటలో నడుచుకోవాలని కోరారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శివాజీ మహరాజ్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్‌రాజ్ శెరికార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవరావు, మాజీ సర్పంచ్ సిమాన్, బీఆర్ఎస్ నాయకులు బసవరాజ్, బసిరెడ్డి, నారాయణ, యాదవరావు, హన్మరెడ్డి, జ్ఞాన్‌పాటిల్, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నవ చండీయాగం ప్రారంభం



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీ మాత ఆలయంలో బుధవారం లలితా వైభవం ట్రస్టు వ్యవస్థాపకులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించిన నవచండీ యాగం, రాజరాజేశ్వర కల్యాణాన్ని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ప్రారంభించారు. దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సమాజహిత కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, తాడ్‌లూర్ మహారాజ్ దత్తు మహారాజ్, అంతర్‌గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతీ మహారాజ్, లలితాంబికా దేవి పీఠాధిపతి శ్రీపంతులు, ఎమ్మెల్యే సతీమణి అనుపమారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

చెరుకు గడలు అందజేత



చెరకు గడలు అందజేస్తున్న వరప్రసాద్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ఐడిఏ బొల్లారం పారిశ్రామిక వాడలో నివసించే విభిన్న రాష్ట్రాలకు చెందిన ప్రజల ఆచార సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన మహిళలకు చట్‌పూజ సందర్భంగా చెరుకు గడలు అందజేశారు. అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయికిరణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనాయుడు, నాయకులు విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో...

బొల్లారం మున్సిపాలిటీలోని పోతమ్మ బస్తీలో గల దుర్గామాత ఆలయంలో నిర్వహించిన చట్ పూజలకు సంబంధించి ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన మహిళలకు రాష్ట్ర కార్మికనాయకుడు వరప్రసాద్ రెడ్డి, బుధవారం చెరుకు గడలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఏటా నిర్వహించే చట్ పూజలను ఈసారి కూడా వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులకు బహుమతులు అందించిన భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్ అన్నారు. బుధవారం భెల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నవ్యశ్రీ, శైలేంద్రనాథ్, జోగేందర్, బాల, సాయి, సందీప్‌లు రాష్ట్ర క్రీడాపోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ టీపీటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా రవీందర్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం టీపీటీఎఫ్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బానోత్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింగ్, లోకనాథం, జ్యోతి కార్యదర్శులుగా గంగరాజు, ధర్మారావు, వెంకటేశం, ప్రసన్న, జిల్లా కౌన్సిలర్లుగా గణేష్, రజని, గణేష్, గౌసుద్దీన్, మల్లప్ప, నరేష్, మాధురి, ఆడిట్ కమిటీ కన్వీనర్ నరేష్, సభ్యులుగా వేణుగోపాల్, ప్రవీణ్, అకడమిక్ సెల్ కన్వీనర్ గా వాసవి, జీఓల కమిటీ కన్వీనర్‌గా సత్యనారాయణ, సభ్యులు శ్వేత, ప్రేమలత సోషల్ కమిటీ కన్వీనర్‌గా మంజుల, సభ్యులు, సంధ్యారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ ‘పేట’లో శివుడి విగ్రహం ఏర్పాటు చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణం నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే 65వ నంబర్ జాతీయ రహదారిని కలిపే జంక్షన్ సమీపంలో శివుని విగ్రహం ఏర్పాటుకు 30 గుంటల స్థలం కేటాయించాని బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణకు పలువురు హిందూ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. శివుడి విగ్రహ ఏర్పాటుతో పట్టణానికి తలమానికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు పవన్‌కుమార్‌గౌడ్, రవీంద్రనాథ్ రాందాసి, వెంకటేశం గుప్త, బరాడి తిరుపతి, కందిమల్లేశం, నాగరాజు, మల్లికార్జునశంకర్, నాగనాథ్, పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, బస్వరాజ్, రజనీకాంత్, కృష్ణారెడ్డి, అప్రమాది రాచన్న, మహేశ్‌స్వామి, జైన్ మహావీర్,చందుస్వామిలు పాల్గొన్నారు.

◆ వాహనాల తనిఖీ

మునిపల్లి (అందోల్): ఎస్పీ ఆదేశాల ప్రకారం 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం కంకోల్ గ్రామ శివారులో బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

◆ బస్తీ దవాఖాన భవన నిర్మాణానికి భూమి పూజ

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం కాసాలలో బస్తీ దవాఖాన భవన నిర్మాణానికి తహసీల్దార్ ఫర్హీన్ షేక్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బస్తీ దవాఖాన నిర్మాణం పనులు పూర్తయితే గ్రామస్తులకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, నాయకులు రాంరెడ్డి, వెంకటేశంగుప్తా, సత్యనారాయణ, సురేందర్ గౌడ్, గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ ,ప్రభు, పాల్గొన్నారు.

◆ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ తహసీల్దార్ కార్యాలయన్ని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సిబ్బంది హాజరు శాతం గురించి అరా తీశారు. ధరణి, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఉమాశంకర్‌ను ఆదేశించారు. మండల ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సూచించారు.

◆ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌పై సమాచార రాష్ట్ర కమిషనర్‌కు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాములు నేత బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్‌లు ఇస్తున్నారని, సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం తగు సమాచారం ఇవ్వాలని ఆయన మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా సమాచారం ఇవ్వడంలేదని, ప్రతి రోజు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని విచారం వ్యక్తం చేశారు. మున్సిపల్‌కు కౌన్సిల్ లేనందున కమిషనర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. సమాచార హక్కు చట్టం కింద సమాచారం ఇవ్వని కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, నోటీసులు ఇప్పించి తాను దరఖాస్తు చేసుకున్న అంశంపై సమాచారం ఇప్పించాలని కోరారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం మోర్గికి చెందిన శ్రీకాంత్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.41,500 చెక్కును బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా నాయకులు సాగర్ షెట్కార్ అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించడానికి ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని వారు ఈసందర్భంగా తెలిపారు.

◆ బైక్‌ను ఢీకొట్టిన కారు – ఒకరు మృతి, మరొకరికి గాయాలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. గొల్లగూడెం గ్రామానికి చెందిన కోల్కూరి ఆంజనేయులు(38) ఓ వెంచర్‌లో పని చేస్తున్నాడు. పని ముగించుకొని గ్రామానికి ద్విచక్ర వాహనంపై శివ(35)తో కలిసి బయలుదేరాడు. గొల్ల గూడెం చౌరస్తా వద్దకు చేరుకోగానే సంగారెడ్డి వైపు నుంచి బీదర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా, వెనుకాల కూర్చున్న శివకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.